సాక్షి సంగారెడ్డి

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



ప్యారవరం గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

కుమ్మేసిన వాన

సంగారెడ్డి జోన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మంగళవారం సాయంత్రం వర్షం కుమ్మేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కురిసిన వర్షాలకు సతమతమవుతున్న రైతులు.. మళ్లీ వర్షం కురవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సాగులో ఉన్న పంటలకు కురుస్తున్న వర్షం నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండల పరిధిలోని ప్యారవరం గ్రామ శివారులోని వాగులో వరద నీరు పొంగిపొర్లడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు, అధికారులు ప్రజలు వాగు దాటకుండా ఉండేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

పంచాయతీ అధికారి సాయిబాబా



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సాయిబాబా

వట్‌పల్లి(అందోల్): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. మంగళవారం స్వచ్ఛత హీసేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఖాదిరాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామలింగం, ఎంపీఓ ఖాజా నసీరుద్దీన్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచండి



సంగారెడ్డిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న గోదావరి తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సభ్యత్వ నమోదులో మరింత వేగం పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. సంగారెడ్డి పట్టణంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ద్వారకా రవి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బీజేపీ ప్రాథమిక సభ్యత్వాన్ని చేయించారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మెదక్ పార్లమెంట్ రెండో స్థానంలో ఉందని, మొదటి స్థానం సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

అంకితభావంతో పని చేయండి

ట్రైనీ ఎస్‌ఐలకు ఎస్పీ రూపేష్ హితవు



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి జోన్: ట్రైనీ ఎస్‌ఐలు అంకిత భావంతో పనిచేసి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో నూతన ట్రైనీ ఎస్‌ఐలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో దురుసుగా మాట్లాడకూడదని, ఎదుటివారి సమస్యను ఓపిగ్గా విని, వారిలో ధైర్యాన్ని నింపి తక్షణ పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. ఎలాంటి అలసత్వం చూపిన శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ముందుండాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవ రావ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి కల్యాణి, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ విజయ కృష్ణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదతరులు పాల్గొన్నారు.

సామాజిక సంఘాలు కలసి రావాలి

భీం ఆర్మీ సంఘం జాతీయ అధ్యక్షులు వినయ్ రతన్‌సింగ్ పిలుపు

జహీరాబాద్ టౌన్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం భీం ఆర్మీ పని చేస్తోందని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు వినయ్ రతన్‌సింగ్ అన్నారు. మంగళవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ సమీపంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, సామాజిక సంఘాలు తమతో కలిసి పనిచేయాలని కోరారు. విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందని, ఈ వ్యవస్థను మెరుగుపరచాలని ఆయన కోరారు. అప్పుడే వెనుకబడిన వర్గాల విద్యార్థుల విద్యాప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బలరాం కాంబ్లే, రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి చలపతిరావు, నాయకులు లక్ష్మి నారాయణ, తీగల శివకుమార్, శేఖర్, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆడిట్

16మంది ఆడిటర్ల నియామకం
- ఆదాయం, నిధులు, వ్యయంపై తనిఖీ
- ఆడిట్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- డిసెంబర్ చివరి వరకు ఆడిట్ పూర్తి

జిల్లాలో గ్రామ పంచాయతీలు- 647 | మున్సిపల్‌లో విలీనమైన పంచాయతీలు-11



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

సంగారెడ్డి జోన్: గ్రామ పంచాయతీలలో ఆడిటింగ్ కొనసాగుతోంది. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఆదాయ, వ్యయాలపై తనిఖీ చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేసిన నిధులు, ఆదాయ, వ్యయ, జమ వివరాలతో పాటు గ్రామ పంచాయతీలలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలను వెలికితీ సేందుకు ఆడిట్ నిర్వహిస్తారు. జిల్లావ్యాప్తంగా 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే సుమారు 200కు పైగా పంచాయతీలలో ఆడిటింగ్ పూర్తి అయింది. డిసెంబర్ చివరి వరకు గ్రామ పంచాయతీల ఆడిటింగ్ పూర్తికానున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

- జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరు అవుతాయి.
- అలాగే.. పంచాయతీ పరిధిలో ప్రజలు ఇంటి పన్ను, వృత్తి వ్యాపార లైసెన్సు పన్నులు పంచాయతీకి చెల్లిస్తుంటారు. గ్రామపంచాయతీలకు జనరల్ ఫండ్‌తో పాటు ఎస్ఎఫ్‌సీ 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతుంటాయి.
- ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు పథకాలు నిర్వహణకు సక్రమంగా ఖర్చు చేశారో లేదో అని, వసూలు చేసిన పన్నులు సరైన విధంగా జమ చేశారా లేదా అనే అంశాలను ఆడిటింగ్‌లో పరిశీలిస్తారు.
- ఆదాయ, వ్యయ, జమకు సంబంధించిన బిల్లులు, ఓచర్లు సరిగ్గా ఉన్నాయా లేదా వాటి రికార్డులు, ఎంబీ బుక్కులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలిస్తారు.
- గతంలో ఆడిటింగ్‌లు మ్యానువల్ పద్ధతిలో చేసేవారు కానీ మూడు సంవత్సరాల నుంచి ఆడిటింగ్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.
- ఆడిటింగ్ నిర్వహించిన రోజు వివరాలను ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారు.
- తర్వాత మార్పులు చేసేందుకు అవకాశాలు ఉండవని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.
- ఇటీవల మున్సిపల్ పరిధిలో విలీనం చేసిన 11 గ్రామపంచాయతీలలో సైతం పంచాయతీల వారిగానే ఆడిటింగ్ నిర్వహిస్తున్నారు. పంచాయతీల ఆడిట్ కొరకు ముగ్గురు అసిస్టెంట్ ఆడిటర్లు, 10 మంది సీనియర్ ఆడిటర్లు, ముగ్గురు జూనియర్ ఆడిటర్లను ప్రత్యేకంగా నియమించింది.

డిసెంబర్ నాటికి ఆడిట్ పూర్తి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీలలో డిసెంబర్ చివరి నాటికి ఆడిటింగ్ పూర్తి చేస్తాం. ఆయా పంచాయతీల వారీగా ఆదాయ, వ్యయ, జమ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆడిట్ చేస్తున్నాం. ప్రస్తుతం గ్రామపంచాయతీలో ఆడిట్ కొనసాగుతోంది.

–బలరాం, జిల్లా ఆడిట్ అధికారి, సంగారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

ఓటరుగా నమోదు చేసుకోవాలి

డిసెంబర్ 30న తుదిజాబితా: కలెక్టర్

సంగారెడ్డి జోన్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈనెల 30 నుంచి నవంబరు 6 వరకు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్‌తోపాటు ఏఈఆర్‌ఓ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబర్ 23న ముసాయిదా జాబితాను ప్రకటిస్తామన్నారు. 23నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి అదే నెల 30న తుది జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ వివరించారు.

నిర్ణీత గడువులోగా జాబితా రూపొందించాలి

ఎస్ఎస్ఆర్–2025 భాగంగా నిర్వహిస్తున్న ఓటరు సవరణ జాబితా నిర్ణీత గడువులోగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హాజరయ్యారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కట్టుదిట్టంగా రూపొందించాలని ఎన్నికల అధికారి ఆదేశించారు. గడువులోగా ఇంటింటి సర్వే పూర్తి పూర్తి చేయాలన్నారు. ఓటరు నమోదు మార్పులు, చేర్పులకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

కొనుగోళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

చలికాలంలో వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన దుప్పట్లు, బ్లాంకెట్లు కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించిన ఆమె.. సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ గురుకుల పాఠశాలలో అన్ని సౌకర్యాలతో సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు చేయాలని, అవసరం ఉన్న చోట ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సమావేశాలలో అడిషనల్ కలెక్టర్ మాధురి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్



మాట్లాడుతున్న శివప్రసాద్

సంగారెడ్డి టౌన్: భూసారం పంటలకు కీలకమని భూమి సారాన్ని తప్పనిసరిగా పరీక్షించి తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని రైతు వేదిక, మండలంలోని కొతల్లాపూర్ గ్రామంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం ద్వారా ఏ నెలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో వాటి ద్వారా పంటలు పండించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి మూడేళ్ల ఒకసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పెసర, మినుములు పంటలోని జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రుక్మిణి, సంగారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటలక్ష్మి, సంగారెడ్డి మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ లక్ష్మి, టెక్నికల్ ఏవో ప్రతిభ పాల్గొన్నారు.

ఏఈఓల సమస్యలు పరిష్కరించండి

జహీరాబాద్ టౌన్, సంగారెడ్డి జోన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఈఓలు జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు రవి, రాష్ట్ర ప్రతినిధులు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తమపై అధిక పని ఒత్తిడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. సర్వే కోసం ఇంటింటికి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఏడేళ్లుగా ఎలాంటి సదుపాయలు లేక తీవ్ర పనిభారంతో ఉన్నామని విచారం వ్యక్తం చేశారు. ఐదు నుంచి ఆరు రెవెన్యూ గ్రామాలు 6,500 ఎకరాల సాగు భూమికి ఒక ఏఈఓ మాత్రమే ఉన్నారన్నారు. అదనంగా ఇతర శాఖల విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్,పాలరాజు, శ్రీనివాస్, సంధ్య, వెంకటేశ్, వేదవతి, శిరిషలు పాల్గొన్నారు.

వరల్డ్ స్కిల్స్ విజేత అశ్విత



అశ్వితను సన్మానించిన గ్రామస్తులు

కొండాపూర్(సంగారెడ్డి): ఫ్రాన్స్‌లోని లియాన్‌లో జరిగిన వరల్డ్ స్కిల్స్‌లో సంగారెడ్డి జిల్లా మెరిసింది. కొండాపూర్ మండలం గిర్మాపూర్‌కు చెందిన అశ్విత బెస్ట్ ఆఫ్ నేషన్ అవార్డుతో పాటు కాంస్య పతకం గెలుచుకున్నారు. మంగళవారం తన స్వగ్రామమైన గిర్మాపూర్‌కు రావడంతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మారుమూల గ్రామం నుంచి ప్రపంచ స్థాయిలో ప్రాతినిథ్యం వహించడమే కాకుండా అవా ర్డు సాధించడం సంతోషంగా ఉందన్నారు. విజేత అశ్విత మాట్లాడుతూ కష్టానికి ప్రతిఫలం దక్కిందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా లక్ష్యానికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. తనకు స్వీట్లు అంటే ఎంతో ఇష్టమని, ఆ ఇష్టమే నన్ను పాక శాస్త్రం వైపు మళ్లించేందుకు దోహదపడిందన్నారు. క్రమంగా తన లక్ష్యాన్ని చేరుకునేందుకు బెంగళూరులో మూడు నెలల పాటు శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా అశ్విత భారతదేశం నుంచి అత్యుత్తమ పోటీదారిగా పాక శాస్త్రంలో నైపుణ్యాన్ని ప్రదర్శించి బెస్ట్ ఆఫ్ నేషన్ అవార్డు గెలుచుకుంది.

గోవా టు హైదరాబాద్

అక్రమంగా మద్యం సరఫరా
- ట్రావెల్స్ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తరలింపు
- జోరుగా సాగుతున్న దందా



బీదర్ నుంచి తీసుకొస్తున్న మద్యంతో పాటు నిందితుడిని పట్టుకున్న అధికారులు (ఫైల్)

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర సరిహద్దు చిరాగ్‌పల్లి వద్ద సోమవారం 20 గోవా మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. అలాగే ఈనెల 9వ తేదీన ఇక్కడే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 12 బాటిళ్ల గోవా మద్యం పట్టుకున్నారు. రాష్ట్ర సరిహద్దులో అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించడంతో ట్రావెల్స్ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో నిత్యం గోవా నుంచి హైదరాబాద్‌కు మద్యం తరలివెళ్తుందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

తక్కువ ధరకు దొరుకుతుండడంతో..

గోవాలో కావాల్సిన ప్రీమియం బ్రాండ్ మద్యం తక్కువ ధరకు దొరుకుతుండడంతో మద్యం ప్రియులు ఇష్టపడి కొనుగోలు చేస్తుంటారు. ఒక్కో బాటిల్ ధరలో వేల రూపాయల తేడా ఉంటుంది. ఇదే అదనుగా భావించి కొంత మంది గోవాలో తక్కువ ధరకు లభించే మద్యాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీంతో గోవా మద్యం అక్రమంగా జహీరాబాద్ మీదుగా హైదారాబాద్‌కు సరఫరా అవుతోంది. గోవా పర్యటనకు వెళ్లిన వారు కూడా మద్యం తీసుకొస్తుంటారు. రాష్ట్ర సరిహద్దుల్లో పెద్దగా తనిఖీలు లేకపోవడంతో యథేచ్ఛగా విలువైన మద్యాన్ని తరలిస్తున్నారు. దీంతో రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుంది.

చెక్‌పోస్టు ఉన్నా తనిఖీలు అంతంతే..

అక్రమ మద్యం రవాణాను నివారించేందుకు మండలంలోని చిరాగ్‌పల్లి సరిహద్దు వద్ద ఎక్సైజ్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కానీ అక్కడ సీఐ, ఎస్సైలు, కానిస్టేబుళ్లు మొక్కుబడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా కర్నాటక, మహరాష్ట్ర, గోవా నుంచి వచ్చే బస్సులు, వాహనాల్లో అక్రమంగా మద్యం తరలిపోతుంది. అయితే అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించి కొన్ని మద్యం బాటిళ్లను పట్టుకుంటున్నారు. రాష్ట్ర సరిహద్దులో గల కర్నాటకలోని బీదర్ పట్టణం నుంచి డిఫెన్స్ మద్యాన్ని అక్రమార్కులు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విషయం తెలుసుకొని ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టడంతో మద్యం పట్టుబడుతుంది. డిఫెన్స్‌కు చెందిన ఖాళీ మద్యం సీసాలో నకిలీ మద్యాన్ని నింపి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారుల విచారణలో తేలింది. దీన్ని బట్టి చూస్తే అక్రమ మద్యం దందా జోరుగానే సాగుతోంది. గోవా, కర్నాటక నుంచి అక్రమంగా మద్యం రాకుండా ఎక్సైజ్ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరి నో వర్రీ

ఆశాజనకంగా సాగు
- డివిజన్ పరిధిలో 41,449 ఎకరాల్లో పంటలు

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో వరి సాగు ఆశాజనకంగా ఉంది. చెరువులు, కాల్వలు, వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగు చేశారు. వానాకాలం ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. తర్వాత మోస్తరు, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు నిండి జలకళ సంతరించుకుంది. దీంతో భూగర్భ జలమట్టం పెరిగి పంటలకు మేలు చేకూరిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో వరి కోతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.



కల్హేర్ శివారులో వరి పొలాలు

కల్హేర్(నారాయణఖేడ్): వానాకాలం సాగులో భాగంగా నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో 41,449 ఎకరాల్లో వరి పంటను రైతులు చేపట్టారు. చెరువులు, కుంటలు, వ్యవసాయ బోరుబావుల కింద ఈ సాగు చేశారు. కల్హేర్ మండలంలో 12,651 ఎకరాలు, నారాయణఖేడ్ మండలంలో 9,211 ఎకరాలు, నిజాంపేట మండలంలో 9,701 ఎకరాలు, సిర్గాపూర్ మండలంలో 6,186 ఎకరాలు, కంగ్టి మండలంలో 3,683 ఎకరాల్లో వరి సాగులో ఉంది. నాగల్‌గిద్ద మండలంలో 13 ఎకరాలు, మనూర్ మండలంలో ఎకరం మాత్రమే వరి వేశారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

పంటలకు జీవం

వానాకాలం మొదట్లో వర్షాభావ పరిస్థితి నెలకొంది. పంటలు సాగు చేయాలా? వద్దా అని రైతులు సందేహపడ్డారు. ధైర్యం చేసి వరిని సాగు వేశారు. దీంతో వానలు ఆలస్యంగా కురియడంతో వీరికి కలిసొచ్చింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నల్లవాగు ప్రాజెక్టు నిండింది. చెరువులు, కుంటలకు వరద నీరొచ్చి చేరింది. ఫలితంగా బోరుబావుల్లో భూగర్భజలం పెరిగింది. దీంతో ఎండుతున్న పంటలకు జీవం వచ్చినట్లయింది. మరికొద్ది రోజుల్లో వరి కోతలు మొదలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. కాగా, నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద రైతులు పంట సాగుకు దూరంగా ఉన్నారు. ఆలస్యంగా వర్షాలు పడటమే కారణమని తెలుస్తోంది. కానీ యాసంగిలో పంట సాగు చేసే అవకాశం ఉందని సమాచారం.

పైరు బాగుంది..



నేను 15 ఎకరాల్లో వరి సాగు చేశా. పంట ఆశాజనకంగాఉంది. వరి కోత పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నా.

– శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాపూర్, కల్హేర్ మండలం

వర్షాలతో మేలు



నేను 4 ఎకరాల్లో వరి సాగు చేశా. తొలుత వర్షాలు కురియక ముందు నీటి సమస్య తలెత్తింది. పైరు ఎదుగుదలకు అడ్డంకిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో వరి పంటకు మేలు జరిగింది.

– బి.సాయిలు, కల్హేర్

ఎండు ఆకు తెగులు అరికట్టాలి

కురిసిన వర్షాలకు వరి పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉంది. ఎండ ఆకు తెగులు, ఇతర తెగుళ్ల అరికట్టేందుకు అందుబాటులో ఉన్న వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించాలి. ఇవి పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలి.

– నూతన్‌కుమార్, ఏడీఏ, నారాయణఖేడ్

క్లుప్తంగా

రైతులు అప్రమత్తంగా ఉండాలి : శాస్త్రవేత్తలు



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటలు సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపూర్, చంద్లాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంనగర్, గోనెపల్లి గ్రామాల్లో వరి, పత్తి, కంది, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరి పొట్ట దశలో ఉన్నందున 40 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను బురద పొలంలో వేసుకోవాలని సూచించారు. కంది, పత్తిలో ఇటీవలె కురిసిన వర్షాలకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.శ్రీజయ, డా.పల్లవి, డా.శ్వేత, డా.ఉమారాణి, డా.రమాదేవి, డా.సరిత, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కార్యాలయాల ఆవరణలు పరిశుభ్రంగా ఉండాలి

జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి



శ్రమదానం చేస్తున్న అధికారులు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమ నిర్వహణలో భాగంగా మంగళవారం కొండపాకలోని ఐటీసీ కార్యాలయ ఆవరణలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యాలయాల ఆవరణలు అపరిశుభ్రంగా ఉంటే అనారోగ్యాలకు గురవుతారన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలన్నారు. తడి చెత్త పొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామాచారికి కిన్నెర, బాలు పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న రామాచారి

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు కొమాండూరి రామాచారి కిన్నెర, బాలు పురస్కారం మంగళవారం అందుకున్నారు. ఎస్పీ బాల సుబ్రమణ్యం వర్ధంతి సందర్భంగా రామాచారి అవార్డుకు ఎంపిక కాగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ మాజీ సలహా దారు కేవీ రమణచారి చేతుల మీదుగా హైదరాబాద్ రవీంద్రభారతిలో రామాచారి, సుజాత దంపతులకు అందజేశారు. ఆయన వెంట బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, బాల్య స్నేహితులు సూర్యకుమార్‌గౌడ్ ఉన్నారు.

కళ తప్పుతోంది

సాంస్కృతిక పోటీలపై తగ్గిన ఆసక్తి

- ప్రోత్సహిస్తున్నా ముందుకురాని యువత
- 28న మెదక్‌లో యువజనోత్సవాలు
- జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాని వైనం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

'పడిలేచే కెరటం నా ఆదర్శం' అన్న వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాల్సిన యువతలో చైతన్యం సన్నగిల్లుతుంది. స్వామి వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని 28న మెదక్ జిల్లా కేంద్రంలో యువజనోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక పోటీలు, కార్యక్రమాలు చేపట్టనున్నారు. దీనికిగాను జిల్లాలోని యువత నుంచి దరఖాస్తులు కోరుతున్నా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. 25వ తేదీ వరకు గడువు ఇచ్చినా ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం.

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని మెదక్, పీఎస్ఆర్ స్టేడియంలో 28న జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగనున్నాయి. జానపద నృత్యం, జానపద గీతాలు, హస్తకళలు, వస్త్రం ఆర్గో ఉత్పత్తులు, కథా రచన, పెయింటింగ్, కవిత్వంపై పోటీలను నిర్వహిస్తున్నారు.

దరఖాస్తులు నిల్

విద్యార్థులు, యువతలో సాంస్కృతిక, సాహిత్య, నృత్య ప్రతిభను వెలికి తీసేందుకు యువజనోత్సవాల్లో భాగంగా పలు రకాలు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను విద్యార్థులనుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన చేశారు. 28వ తేదీ పోటీలు జరిగే రోజు ఉదయం 10 గంటలలోపు వచ్చే వారికి కూడా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం. జిల్లాలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విద్యార్థులను సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి చూపేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోటీలు ఇలా..

జానపద నృత్యం: ఇందులో గ్రూపు, వ్యక్తిగత పోటీలు ఉంటాయి. ఏదైనా భారతీయ సంస్కృతీ, సాంప్రదాయానికి సంబంధించిన జానపద పాటపై నృత్యం చేయాల్సి ఉంటుంది. గ్రూపు పోటీలో 10 మంది మాత్రమే ఉండాలి. ఇందులో స్త్రీ, పురుషులు ఇద్దరు ఉండొచ్చు. అలాగే వ్యక్తిగత జానపద నృత్యం పోటీల్లో ఐదుగురు మాత్రమే పాల్గొనాలి. 15 నిమిషాల సమయం ఉంటుంది.

జానపద గీతాలు: ఇందులోనూ వ్యక్తిగతం, గ్రూపు పోటీలు ఉంటాయి. గ్రూపు పోటీలో 10 మంది, వ్యక్తిగత పోటీల్లో ఐదుగురు మాత్రమే పాల్గొనాలి. భారతీయ సాంప్రదాయానికి అనుగుణంగా గీతాలు ఉండాలి. సినిమా పాటలకు అనుమతి లేదు. ఏడు నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఈ పోటీలకు అవసరమయ్యే వాయిద్య పరికరాలు ఎవరికి వారు వెంట తెచ్చుకోవాలి. లైవ్ ప్రదర్శన ఇచ్చిన వారికే ప్రాధాన్యం ఉంటుంది.

కవిత్వం : పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు కుల, మత, రంగు, జాతి, నమ్మకాలను కించపర్చకుండా గంట వ్యవధిలో 500 పదాలతో కవిత్వం రాయాలి.

వ్యాసరచన: ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లం లేదా హిందీలో 60 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. ఒకసారి ఎంపిక చేసిన అంశం మార్చేందుకు వీలుండదు. కుల, మత, రంగు, జాతి, నమ్మకాలను కించపర్చకుండా గంట వ్యవధిలో 1,000 పదాలతో వ్యాసం రాయాలి.

వక్తృత్వ పోటీ: అభ్యర్థులు లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లం లేదా హిందీ భాషలో మూడు నిమిషాల్లో పూర్తి చేయాలి.

పెయింటింగ్: ఏ3 సైజ్ పేపర్‌పై 90 నిమిషాల్లో బొమ్మ వేసి.. 20 నుంచి 30 పదాల్లో శీర్షిక రాయాలి.

యువక్రిటీ: యువతీ యువకులు దేశంలోని వివిధ ప్రాంతాల హస్తకళలను అర్థం చేసుకునేందుకు, అభినందించేందుకు ప్రత్యేక అవకాశం ఇస్తారు. హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల కేటగిరిలో ఇద్దరిని ఎంపిక చేస్తారు. పోటీలకు హాజరైన యువతీ యువకులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుంది. అక్కడ ప్రతిభ కనబర్చిన వారిని 2025 జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుంది.

ఉత్తమ ప్రతిభకు ప్రోత్సాహం



ఇప్పటికే జిల్లాలోని అన్ని కళాశాలకు సమాచారం అందించాం. నేటి వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచనలు చేశాం. 28వ తేదీ ఉదయం 10 గంటలలోపు వచ్చే వారికి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. జిల్లా నివాసులై 15 నుంచి 28 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలి. మూడేళ్లలో నిర్వహించబడిన జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొన్న యువతీ, యువకులు లేదా గ్రూపులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అనర్హులు. పూర్తి సమాచారం కోసం 9493594388, 7396313741 నంబర్లలో సంప్రదించాలి.

– దామోదర్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి, మెదక్

తాను చనిపోతూ.. ఐదుగురికి అవయవదానం

పటాన్‌చెరులో మహిళ బ్రెయిన్ డెడ్



అనిత(ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : తాను చనిపోతూ ఐదుగురికి బతుకునిచ్చింది ఓ మహిళ. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో ఆమె అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఇందిరమ్మ కాలనీకి చెందిన విఠల్ భార్య అనిత(33) పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికురాలిగా పని చేస్తోంది. 19 తేదీన విధులకు ఇంటి నుంచి నడుకుంటూ వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. తీవ్రగాయాలైన ఆమెను సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా 23వ తేదీన బ్రెయిన్ డెడ్ అయ్యింది. అనంతరం ఆమె అవయవాలను దానం చేస్తే మరొకరిని బతికించినట్లు అవుతుందని వైద్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు వివరించారు. దీంతో వారు ఒప్పుకున్నారు. మృతురాలికి సంబంధించి ఇద్దరికి కిడ్నీలు, ఒకరికి లివర్, మరో ఇద్దరికి కండ్లు మొత్తం ఐదుగురికి అవయవదానం చేసినట్లు వైద్యులు తెలిపారు.

రాజీపడేటట్లు కౌన్సెలింగ్ నిర్వహించాలి

సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీపడే కేసుల్లో రాజీకుదుర్చుకునేలా కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సీపీ అనురాధ తెలిపారు. కోర్టు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లిస్టు అవుట్ చేసిన కేసుల్లో అన్ని కేసులు రాజీపడేట్లు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్‌ను ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. జ్యుడిషియల్ అధికారులతో లైజనింగ్ ఏర్పరచుకొని విధులు నిర్వహించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో కేసులు డిస్పోజల్ అయ్యేట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ లోకేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



అవగాహన కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు, విద్యార్థులు

సంగారెడ్డిక్రైం: పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి పొగాకు నియంత్రణ కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ఎంసీఏ హాస్పిటల్, పాత బస్టాండ్, స్కిల్ డెవలప్మెంట్ వద్ద పొగాకు నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సుల వారు కూడా పొగాకు అలవాటు చేసుకుంటున్నారన్నారు. దీనిపై ప్రజలు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి నుంచి 60 రోజుల పాటు విద్యాసంస్థలు, గ్రామాలు, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు నియంత్రణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముంతాజ్ అలీ, లక్ష్మీ, కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి పాల్గొన్నారు

ధూమపాన నివారణే లక్ష్యం

- మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ రఫీ
- మిట్టపల్లిలోని సురభిలో ధూమపాన నివారణ కేంద్రం ప్రారంభం



మెడికల్ కళాశాలలో ధూమపాన నివారణ కేంద్రం ప్రారంభిస్తున్న వైద్యులు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాలలో మంగళవారం ధూమపాన నివారణ కేంద్రాన్ని ప్రారంభించారు. పొగాకు రహిత యువత క్యాంపెయిన్‌లో భాగంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, నేషనల్ మెడికల్ కౌన్సిల్ సంయుక్తంగా దేశంలోని మెడికల్ కళాశాలల్లో పొగాకు నివారణ కేంద్రాలను ప్రారంభించాలని సూచించింది. అందులో భాగంగా సురభి మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ధూమపాన నివారణ కేంద్రాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ రఫీ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రామప్రసాద్ మాట్లాడుతూ.. ధూమపానం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధుల బారిన పడిన యువత ప్రతీయేటా లక్షల మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. నివారణ కేంద్రంలో ధూమపానికి అలవాటు పడిన వారికి చికిత్స అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా.శివరామచారి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ కరుణాకర్, సైకియాట్రీ విభాగం హెచ్‌ఓడీ రాజేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరీశ్, డాక్టర్ దేవిక, క్లినికల్ సైకాలజిస్టు లీల, పీఆర్వో పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. రెండు రోజులకు శవమై

చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య



శేఖర్(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): అదృశ్యమైన యువకుడు చెరువులో శవమై తేలాడు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన మచ్కురి శేఖర్(32) మద్యం మానేసిన పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండేవాడు. ఆదివారం తెల్లవారు జామున నిద్రలేచి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సాకీ చెరువులో మృతదేహం తేలడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని నిర్ధారించారు. యువకుడి సోదరుడు విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు

తూప్రాన్: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ పరిధి ఆబోతుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. ఆబోతుపల్లి గ్రామానికి చెందిన ప్రవీన్‌యాదవ్(30)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఐదు రోజుల కిందట కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పీఎం శ్రీ' స్కూల్‌గా వర్గల్ నవోదయ

- ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం
- మారనున్న విద్యాలయం పేరు



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకానికి ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ఎంపికైంది. దీంతో విద్యాలయ పేరు 'పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ' వర్గల్‌గా మారనుందని మంగళవారం నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ వెల్లడించారు. వివిధ ప్రాధామ్యాల ప్రాతిపదికన దేశవ్యాప్తంగా 14,500 విద్యాలయాలను ఎంపిక చేయనున్నారని, అందులో వర్గల్ నవోదయకు అవకాశం దక్కిందని పేర్కొన్నారు. ఇది తమకు ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యాలయాలను నూతన విద్యా విధానం-2020లో నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అనుగుణంగా అభివృద్ధి పరుస్తారని తెలిపారు. వీటికి కేంద్ర ప్రభుత్వం నేరుగా ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. వర్గల్ నవోదయకు ఈ నిధులతో మరిన్ని హంగులు సమకూరుతాయన్నారు. నూతన విద్యా విధానం-2020 నిర్దేశిత లక్ష్యాలను సిద్ధింపజేస్తూ పీఎంశ్రీ వర్గల్ నవోదయ విద్యాలయను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యంగా ముందుకుసాగుతామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



తిరుపతి మృతదేహం

అక్కన్నపేట(హుస్నాబాద్):విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన అక్కన్నపేట మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్మిట్ట మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని జూరాల తండాకు చెందిన గుగులోతు తిరుపతి(25) పరిసరాల గ్రామాల్లో కరెంట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వీరి సొంత తండా ముంపుగుడాటిపల్లి గ్రామ పరిధిలోని జాలుబాయితండా గౌరవెల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురి కావడంతో కుటుంబమంతా జూరాల తండాకి వచ్చి నివాసం ఉంటున్నారు. తిరుపతి మంగళవారం జాలుబాయితండాకు వచ్చి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఏబీ స్విచ్‌లో మంటలు రావడంతో రిపేర్ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై విజయ్‌భాస్కర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..



భూమయ్య(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్):ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన గుండమొల్ల భూమయ్య(70) మంగళవారం చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు బయటకు తీసేలోపే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సమీ తెలిపారు.

శ్రీ పద్ధతి వరి సాగుతో అధిక దిగుబడులు




వ్యవసాయ విస్తరణ అధికారులతో రాధిక

జిల్లా వ్యవసాయాధికారి రాధిక

కొండపాక(గజ్వేల్): శ్రీ పద్ధతి వరి సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి రాధిక పేర్కొన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లి రైతు వేదికలో నీటి సంరక్షణ, నీటి యాజమాన్యంపై వ్యవసాయ విస్తరణ అధికారులకు మంగళవారం శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. వాటర్ షెడ్ పథకంతో నీటి నిల్వలు పెరుగుతాయన్నారు. వంగడాల తయారీ పరిశోధన సంస్థ ఏర్పాటు చేసే శిక్షణ తరగతులు రైతులు ఆధునిక సాగుకు ఆకర్శితులను చేసేలా ఉపయోగించుకోవాలన్నారు. వాణిజ్యం, కూరగాయాల, పూల తోటల సాగు పంటల సాగు రైతులకు తుంపర, బిందు సేద్యం పరికరాలను సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. వరి సాగులో ఎకరా పొలానికి అవసరపడే నీరు బిందు సేద్యం సాగులో 3 ఎకరాల వరకు ఉపయోగపడుతుందన్న విషయాన్ని విరివిగా ప్రచారం చేయాలన్నారు. బిందు, తుంపర్ల సేద్యంలో లాభాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్, మండల వ్యవసాయాధికారి గోవిందరాజుతోపాటు అధికారులు సునీత, అన్నపూర్ణ, ఏఈఓలు పాల్గొన్నారు.

చెరువులు, వాగులు పరిశీలన



చినిగెపల్లి చెరువును పరిశీలిస్తున్న గీత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని డప్పూర్, మల్గి, వడ్డి, చినిగెపల్లి గ్రామాల పరిధిలోని వాగులు, చెరువులు, మంజీరా నదిని సోమవారం అధికారులు పరిశీలించారు. తమ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే ఇక్కడి జలాలు కలుషితమవుతాయని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాలకు చెందిన భూ బాధితులు, రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి గీత డప్పూర్‌లోని చాకలి వాగు, నక్కవాగు, చినిగెపల్లి చెరువులను పరిశీలించారు. అనంతరం వాగులు, చెరువుల నీరు మంజీరా నదిలో కలిసే ప్రాంతాన్ని సందర్శించారు. వాటి ఫొటోలను తీసుకొని సమాచారాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే వాయు కాలుష్యంతోపాటు జలాలు కూడా కలుషితమవుతాయని రైతులు అక్కడికి వచ్చిన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర

సంగారెడ్డి టౌన్: రాజీ మార్గంలో కేసులు పరిష్కరించడానికి పోలీసు అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర అన్నారు. లోక్ అదాలత్‌లో వచ్చే కేసులను తొందరగా పరిష్కరించాలని, రాజీమార్గంతో పరిష్కరించే విధంగా చర్యలు ఉండాలన్నారు. ఈ నెల 28న నిర్వహించే కార్యక్రమానికి కక్షిదారులకు న్యాయం జరిగేలా చేయాలన్నారు. లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా జడ్జీలు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రమేశ్

మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన

విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మంచి చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండేలా చూడాలని న్యాయపరమైన సేవలను అందించడానికి న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.